క్లుప్తంగా

ఘనంగా కోటకొండ గంగమ్మ తిరునాల


కోటకొండ గంగమ్మ విగ్రహ ఊరేగింపు

తంబళ్లపల్లె: మండలంలోని కోటకొండ చెరువు కట్టపై వెలసిన శ్రీగంగమ్మ ఆలయం తిరునాలను వైభవంగా నిర్వహించారు. పూజారి శ్రీనివాసులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. రాత్రి చాందినీ బండ్ల మెరవని భక్తులను అలరింప చేశాయి.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ


ప్రతాప్‌కుమార్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాగార్జున రెడ్డి

కలికిరి: మండలంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 17న మృతి చెందాడు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ప్రభుత్వ సలహాదారు నాగార్జున రెడ్డి శనివారం కలికిరి రెడ్డివారిపల్లిలోని సర్పంచ్ స్వగృహానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ సతీమణి ఎంపీటీసీ సభ్యురాలు గాయత్రి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబం మనోధైర్యంతో ఉండాలన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని స్థానిక ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం డిపో కార్యాలయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. మే నెలలో రీజియన్‌లో ఓఆర్‌లో మొదటి స్థానం, కెఎంపిఎల్‌లో రెండవస్థానం నిలిచినట్లు తెలిపారు. సిబ్బంది సహకారంతో ఇది సాధ్యపడిందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లకు కడప రీజినల్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణలో ఇచ్చిన విషయాలు తప్పకుండా పాటించి సంస్థ ఆదాయం పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇకపై పెద్దలకూ బీసీజీ టీకా

పీలేరు : ఇది వరకు పిల్లలకు మాత్రమే వేసే బీసీజీ టీకా ఇకపై పెద్దలకు కూడా ఇవ్వనున్నట్లు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక బండ్లవంక గ్రామ సచివాలయంలో కొన్ని పరిమితులకు లోబడి పెద్దలకు కూడా బీసీజీ టీకా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇది సురక్షితమైన టీకా అని, మధుమేహ వ్యాధి గ్రస్తులు, 60 సంవత్సరాలు పైబడ్డ వారు, మద్యపానం, ధూమపానం, క్షయనుంచి నివారణ పొందిన వారు, బలహీన వ్యాధి నిరోధకత కలవారు టీకా పొందాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, సిబ్బంది కుసుమ, రత్నం, భార్గవి, చంద్రకళ, సుధ తదితరులు పాల్గొన్నారు.

యల్లమ్మ ఆలయానికి సింహవాహనం వితరణ


వితరణ చేసిన సింహవాహనం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట యల్లమ్మ ఆలయానికి కేవీపల్లె పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన చిచ్చిలి కుటుంబ సభ్యులు సింహవాహనం వితరణ చేశారు. గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపునకు అనువుగా సింహ వాహనం రూపొందించి ఆలయానికి ఇచ్చినట్లు దాతలు తెలిపారు. సుమారు రూ. 3 లక్షలు విలువైన సింహ వాహనం ఇవ్వడం పట్ల ఆలయ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కోదండ రామస్వామి రథోత్సవం



ములకలచెరువు: మండలంలోని సోంపల్లెలో వెలసిన కోదండ రామస్వామి రథోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో శనివారం నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పుర వీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

చక్రస్నానం.. భక్తజనపునీతం


చక్రత్తాళ్వార్, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ


పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు పూజలు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం చక్రస్నానం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున సుప్రభాతం అనంతరం తోమాలసేవ, అభిషేక పూజలు అలంకరణల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరుడు తిరుచ్చిపై ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అక్కడ ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్ ఆద్వర్యంలో ఉభయదేవేరులకు, చక్రతాళ్వారుకు స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు,పెరుగు, తేనె, చందన సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ అర్చకులు చక్రతాళ్వారుకు పుష్కరిణిలో అవభృథస్నానం చేయించారు. అదే సమయంలో అశేష భక్తులు గోవింద నామస్మరణలతో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. తమ పాపాలను హరించి పునీతులను చేయి స్వామీ అంటూ భక్తులు వేడుకున్నారు. సాయంత్రం దోపు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణంతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, ప్రసాద్‌రెడ్డి, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్రబలగాలు

పీలేరు రూరల్ : గ్రామాల్లో అల్లర్లకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పీలేరు పట్టణం తలపులలో జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు సీఆర్‌పీఎఫ్ కేంద్రబలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల అనంతరం కూడా పది హేను రోజులు పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదన్నారు. కౌంటింగ్ అనంతరం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, గుంపులు గుంపులుగా ఉండరాదని, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు నరసింహుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమ నిర్మాణాలు తొలగింపు

పీలేరు రూరల్ : స్థానిక మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ లేఅవుట్-3లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. శనివారం తహసీల్దార్ మహబూబ్‌బాషా ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను జేసీబీలతో తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ చాణక్య, వీఆర్‌వోలు సురేష్‌రెడ్డి, శిల్ప, కవిత, సర్వేయర్లు మనోజ్, చంద్రశేఖర్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లిబిడ్డలకు తీవ్ర గాయాలు

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో తల్లి బిడ్డలు తీవ్రంగా గాయపడిన సంఘటన వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. వాల్మీకిపురం మండలం కూరపర్తి పంచాయతీ గంగాదొడ్డి గ్రామానికి చెందిన టీ.శిరీష (25) తన కుమార్తె టీ.మౌనిక (5) కుమారుడు వేదాంత్‌గురు(3) తో కలిసి ద్విచక్రవాహనంలో సొంత పనులపై సీటీఎం వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలోని వాల్మీకిపురం పొలిమేరలో నూతన సబ్‌జైలు నిర్మాణం వద్ద వెనుక నుంచి వచ్చి కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో తల్లి,బిడ్డలకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

– మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి


కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, నరిబాబాయ్ తదితరులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ యువనాయకులు, బీఎస్ఎన్ఎల్ తిరుపతి ప్రాంతీయ జిల్లా అడ్వైజరీ బోర్డు సభ్యులు డి.హర్షవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. శనివారం 31వవార్డు కౌన్సిలర్ సింధలూరి రజని, నరిబాబాయ్ ఆధ్వర్యంలో హర్షవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అపెక్స్ కిడ్నీ హాస్పిటల్ సౌజన్యంతో కదిరిరోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి మాట్లాడుతూ...నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి, పార్టీ గెలుపుకు హర్షవర్ధన్‌రెడ్డి కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరానికి హాజరైన ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్వీ.రమణ, రామిశెట్టిశివ, ఈశ్వర్‌నాయక్, సాయిశేఖర్‌రెడ్డి, హేమంత్‌కుమార్, కోటూరి ఈశ్వర్, కృష్ణమూర్తి, హర్ష యువసేన పూర్ణ, మహి, సూరి, రాజు, శ్యామ్, లోకేష్, తులసి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా దివ్యాంగుల బడిబాట సర్వే


సోంపల్లె పంచాయతీలో దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న నీరజా

ములకలచెరువు: దివ్యాంగులకు బడిబాట కల్పించడం కోసం ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని శనివారం మండలంలో నిర్వహించారు. ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జూన్ 9వ తేదీవరకు డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ జనార్ధన్ ఆదేశాల మేరకు భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వెంకటరమణ రీసోర్స్ టీచర్స్ అంకిశెట్టి నీరజా, కళావతి తెలిపారు. మండలంలోని 16 పంచాయతీల్లో జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సర్వే నిర్వహించామన్నారు. శనివారం రీసోర్స్ టీచర్స్ అంకిశెట్టి నీరజా, కళావతి సోంపల్లె, చౌడసముద్రంలో సర్వే నిర్వహించారు. వారు స్థానిక మీడియాతో మాట్లాడుతూ మండలంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వేలో భవిత సిబ్బంది గుర్తించిన ప్రత్యేక అవసరాలు కలిగిన మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరేళ్ల పైబడిన వారిని పాఠశాలల్లో చేర్పించనున్నట్లు తెలిపారు. బడి ఈడు దివ్యాంగుల పిల్లల నమోదు కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను చైతన్యపరచి పిల్లలను భవిత కేంద్రాలకు రప్పించి అక్కడ విద్యాబుద్ధులు నేర్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సర్వేలో మండల వ్యాప్తంగా 50 మందిని గుర్తించినట్లు తెలిపారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు


స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు, వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్య, వైద్యం, తాగునీరుపైనే చర్చ


మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన నిర్వహించిన మండల్ మీట్‌లో ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు, వ్యవసాయంపైనే చర్చించారు. మండలంలోని కందుకూరు, తుమ్మరకుంట పంచాయతీ బండమీదపల్లి, పులికల్లు హౌసింగ్ కాలనీల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజా ప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరి దృష్టికి తీసుకొచ్చారు. 2024-2025 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంఈఓ నారాయణ కోరారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ప్రభుత్వం ద్వారా ఈ నెల 29 నుంచి రైతులకు రాయితీపై వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తామని ఏవో ప్రేమలత తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అమలవుతున్న క్షయ వ్యాధి నిర్మూలన టీకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శివన్న సూచించారు. కోడ్ కారణంగా మండల్ మీట్‌లో ఎటువంటి అజెండా కార్యక్రమాలు నిర్వహించలేదు. సమావేశంలో వైస్ ఎంపీపీ శోభా, శంకర్, ప్రత్యేక ఆహ్వానితులు సుబ్బరాం, ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి, ఏవో గిరిధర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్లు శంకర్, యస్దానీ, ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ, ఏపీఎం శ్రీనివాసులు, పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

డీఈఓ యు. శివప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

పీలేరు : జిల్లాలో రెండో విడత నాడు- నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో యు. శివప్రకాష్‌రెడ్డి సూచించారు. శనివారం పీలేరు పట్టణంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక, పాఠశాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాల ఉపాధ్యాయులచే నాడు నేడు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత 1018 పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పీలేరు మండలంలో 30 పనులు జరుగుతున్నాయని, జూన్ 12వ తేదీ లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1720 మంది విద్యార్థులు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. విద్యాహక్కు చట్టం పథకంలో 600 మంది విద్యార్థులు ఎంపిక కాగా ఇప్పటి వరకు 574 మంది అడ్మిషన్ పొందారని చెప్పారు. పాఠశాల పునఃప్రారంభానికి ముందే విద్యాకానుక, పాఠ్యపుస్తకాలు అందివ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో నాగేంద్రరెడ్డి, , ఏఈ రమేష్, ఎంఈవోలు వై. లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, రెడ్డిబాషా, హెచ్‌ఎంలు వేణుగోపాల్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతల

పీలేరు రూరల్ : మండలంలోని అగ్రహారం పంచాయతీ యల్లెలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బుడిగిరెడ్డి శ్రీరాములురెడ్డి రెండు వారాల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం శ్రీరాములురెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే తోపాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకులు హబీబ్‌బాషా, బాబురెడ్డి, సురేష్‌రెడ్డి, మునిరెడ్డి, ఎస్.వి. చలపతి, జయరామిరెడ్డి, అమరనాథరెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాకు నోటీసులు

కలకడ : అంగన్‌వాడీ కేంద్రం నుంచి చిన్నారులను సక్రమంగా సకాలంలో ఇంటికి చేర్చకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సాక్షిలో శనివారం వార్త ప్రచురితం కావడంపై స్పందించిన వాల్మీకిపురం అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధికారి రాజమ్మ తన సిబ్బందితో ప్రమాదానికి గురైన చిన్నారి స్పందన ఇంటికి వెళ్ళి విచారించారు. శుక్రవారం అంగన్‌వాడీ ఆయా కేంద్రం వద్దనే చిన్నారులను వదలిపెట్టడం వల్లనే తమ పిల్లలకి ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. అధికారులు ఆయా అమ్మాజికి సంజాయిషీ నోటీసు ఇచ్చి వారం లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతమ్మ, సచివాలయ సిబ్బంది స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో రికార్డింగ్ డ్యాన్స్, డీజేలు నిర్వహిస్తే చర్యలు

కలకడ : మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న జాతరలు, గ్రామ దేవతల ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్స్, డీజేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జాతరలను భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా, శాంతి యుతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఇంకనూ అమలులో ఉందని, నిబంధనల మేరకు ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. శనివారం మండలంలోని కె.దొడ్డిపల్లె, దేవులపల్లె, పొత్యం మూల గ్రామాల్లో ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌బాబు, హరిబాబులు చాందినీబండ్లు కట్టేవారిని, ఆలయ కమిటీ సభ్యులను కలిసి ముందస్తు సమాచారం తెలియజేశారు. కె.దొడ్డిపల్లెలో మాజీ సర్పంచ్ డాక్టర్ జనార్ధన్‌నాయుడు, గ్రామస్తులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగవని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భక్తుల కొంగుబంగారం పోలేరమ్మ



గుర్రంకొండలోని గ్రామదేవత పోలేరమ్మ ఆలయం, పోలేరమ్మ తల్లి ప్రతిమ

నేటి నుంచి తిరునాల ఉత్సవాలు

గుర్రంకొండ: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై విరాజిల్లుతోంది శ్రీపోలేరమ్మతల్లి. గుర్రంకొండ మేజర్ పంచాయతీ గ్రామదేవతైన అమ్మవారి తిరునాల ఉత్సవాలు ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నారు. గుర్రంకొండను నవాబుల పరిపాలించే కాలంలో వారి చేత పూజలందుకున్న చల్లని తల్లి శ్రీ పోలేరమ్మ. మతాలకు అతీతంగా పోలేరమ్మ ముస్లిం నవాబుల చేత కూడా పూజలందుకొంది. అంతటి ఘన చరిత్ర కలిగిన పోలేరమ్మ తల్లి ఆలయంలో ఈనెల 26 ఆదివారం కోటలోని శ్రీ శిలేమాతమ్మకు, కొత్తపేటలోని శ్రీపోలేరమ్మ తల్లులకు మహిళలు దివిటీలు, బోనాలు సమర్పించనున్నారు. 27న సోమవారం రోజున రాత్రి తిరునాల ఉత్సవాలు జరగనున్నాయి. ఈసందర్భంగా రంగురంగుల చాందినీ బండ్లు మేళతాళాలతో ఊరేగించనున్నారు. ఆలయం పరిసరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 28న మంగళవారం రోజున పగలు తిరునాల జరుగుతుంది. ఈసందర్భగా అమ్మవారికి పెద్ద ఎత్తున ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాల్లో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి గంగమ్మ తల్లి పెళ్లి సంబరాలు నిర్వహించిన అనంతర తిరునాల ఉత్సవాలు ముగుస్తాయి.



